

దారి తప్పిన స్పెషల్ డ్రైవ్

పెండింగ్ భూ సమస్యల తక్షణ పరిష్కారం కోసం ప్రభుత్వం చేపట్టిన ధరణి స్పెషల్ డ్రైవ్ దారి తప్పింది. 8లో▸



భానుడి భగభగలు

రోజురోజుకూ పెరుగుతున్న ఎండ తీవ్రతతో జనం అల్లాడిపోతున్నారు. పగటి ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరుగుతున్నాయి. 9లో▸



రక్తదానంతో ప్రాణదానం

రక్తదానంతో ఆపదలో ఉన్న ఎందరో ప్రాణాలను కాపాడవచ్చని పరిగి డీఎస్పీ కరుణ సాగర్‌రెడ్డి అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



స్ట్రాంగ్ రూం వద్ద భద్రతా సిబ్బందితో మాట్లాడుతున్న లింగ్యానాయక్

కొడంగల్: మహబూబ్‌నగర్ లోక్‌సభ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సెక్టోరియల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పోలింగ్ నిర్వహణకు 352 ఈవీఎం సెట్లు, 394 వీవీ ప్యాడ్లు అవసరమని చెప్పారు. ప్రస్తుతం ఇవి కొడంగల్‌కు చేరినట్లు వివరించారు. ఎన్నికల విధుల్లో 29 మంది సెక్టోరియల్ ఆఫీసర్లు ఉంటారని తెలిపారు. ఎన్నికల అధికారులు ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, డీటీ సురేష్ పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూం పరిశీలన

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంను అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ మంగళవారం పరిశీలించారు. అక్కడి భద్రతా సిబ్బందితో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొడంగల్ నియోజకవర్గంలోని మూడు మండలాలకు అవసరమైన ఎన్నికల సామగ్రి వచ్చిందని తెలిపారు.

హస్తం గూటికి రంగారెడ్డి డీసీసీబీ చైర్మన్



సీఎం రేవంత్‌తో డీసీసీబీ చైర్మన్ సత్తయ్య

తుర్కయంజాల్: డీసీసీబీ చైర్మన్ సత్తయ్య మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. అంతకు ముందు ఆయన తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్ రెడ్డితో కలిసి తుర్కయంజాల్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. తరువాత తొర్రూర్‌లోని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి నివాసానికి వెళ్లి ఆయనను కలిశారు. అనంతరం వారితో వెళ్లి సీఎంను కలిసి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ.. పేద ప్రజలకు కాంగ్రెస్ పార్టీతోనే న్యాయం సాధ్యం అవుతుందని అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి పంపించారు.



అనంతగిరి పద్మనాభస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలందుకున్న సీతారాములు

శ్రీరామనవమికి ఆలయాలు ముస్తాబు

జిల్లాలో శ్రీరామ నవమి పర్వదినానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయాలను విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనల కోసం ఏర్పాట్లు చేశారు. బుధవారం రాములోరి కల్యాణ వేడుకను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకను తిలకించడానికి ఆలయ అధికారులు, పూజారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలకు రానుండటంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. పూజల అనంతరం అన్నదాన కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. – అనంతగిరి



వికారాబాద్‌లో ముస్తాబైన రామ మందిరం

సేవలన్నీ ప్రైవేట్‌కే!

- పేరుకే ప్రభుత్వ వైద్యులు.. విధులు మాత్రం ప్రైవేట్ క్లినిక్‌లలో..
- పైస్థాయి నుంచి కింది స్థాయి వైద్యుల వరకు ఇదే పరిస్థితి
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా విధులకు
- ఇబ్బంది పడుతున్న రోగులు
- పట్టించుకోని పాలకులు



తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి

తాండూరు: ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో వైద్యులు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 4గంటల వరకు విధుల్లో ఉండాలి.. మధ్యాహ్నం 2గంటల వరకు ఓపీ నిర్వహించాలి. ప్రభుత్వ వైద్యులు ప్రైవేట్ క్లినిక్‌లలో విధులు నిర్వహించరాదు.. కానీ ఈ నిబంధనలు తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో అమలు కావడం లేదు. ఇక్కడ పని చేసే వైద్యులు ఉదయం ఆస్పత్రికి వచ్చి రిజిస్టర్‌లో సంతకం చేసి 11గంటల వరకు ప్రైవేటు క్లినిక్‌కు వెళ్లిపోతున్నారు. ఒకరిద్దరు కాదు సూపరింటెండెంట్ మొదలుకొని సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, అసిస్టెంట్ సర్జన్ల వరకు ఇదే పద్ధతి అవలంబిస్తున్నారు. దీంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు తాండూరులో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి తోపాటు అనుసంధానంగా మాతాశిశు ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. ప్రజలకు ఏ చిన్న జబ్బు చేసినా ఇక్కడికే వస్తారు. కానీ ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో ఉండక పోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పేదలకు సర్కారు వైద్యం అందని ద్రాక్షలా మారింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆస్పత్రిలో ఉండాల్సిన వైద్యులు ఉదయం 11 గంటలకే వెళ్లిపోతున్నారు. ప్రభుత్వం నుంచి వేలు, లక్షల్లో జీతాలు తీసుకునే వైద్యులు ప్రైవేటు క్లినిక్‌లలో పని చేస్తుండటంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం వైద్యశాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

సొంతగా ప్రైవేట్ క్లినిక్‌లు..

తాండూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో 50 మంది వైద్యాధికారులు విధులు నిర్వహించాల్సి ఉండగా 27 మందే ఉన్నారు. 23 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మాతాశిశు ఆస్పత్రిలో ఔట్ సోర్సింగ్ ద్వారా వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. అయితే మెజారిటీ వైద్యులు సొంతంగా ప్రైవేట్ క్లినిక్‌లు ఏర్పాటు చేసుకొని వాటికే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు. దాదాపు 12 మంది వైద్యులు స్థానికంగానే ప్రైవేటు క్లినిక్‌లు నడుపుతున్నట్లు సమాచారం. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులను వారివారి క్లినిక్‌లకు రావాలని వైద్యులు సూచించడం గమనార్హం. చాలా మంది రోగులు విధిలేక ప్రైవేట్ క్లినిక్‌లకు వెళ్లి జేబులు ఖాళీ చేసుకుంటున్నారు.

తగ్గుతున్న రోగులు

గతంలో జిల్లా ఆస్పత్రికి నిత్యం 1500 మంది వరకు రోగులు వైద్యం కోసం వచ్చేవారు. ఇక్కడ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో సగం మంది కూడా రావడం లేదు. ఉదయం 11 గంటల తరువాత ఓపీలో ఎవరూ ఉండకపోవడంతో ఆ సమయంలో వచ్చే వారు వైద్యం అందక ప్రైవేటు క్లినిక్‌లకు వెళుతున్నారు. జిల్లా అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే వైద్యులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలని ఇటు ప్రజలు, అటు రోగులు కోరుతున్నారు.

విచారణ జరిపిస్తాం




ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు వైద్యాధికారులు విధుల్లో ఉండాలి. ఆస్పత్రి వేళల్లో బయట క్లినిక్‌లు నిర్వహిస్తున్న వైద్యుల వివరాలు సేకరిస్తాం. విచారణలో వాస్తవమని తేలితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఇబ్బందులు లేకుండా మెరుగైన వైద్యం అందించడమే వైద్యుల కర్తవ్యం.

– డాక్టర్ ప్రదీప్, డీసీహెచ్‌ఎస్

పొలిటికల్ వార్

- ఓట్ల వేటలో ప్రధాన పార్టీలు
- చేరికలపై అన్ని పార్టీల గురి
- ప్రచారంలో దూసుకెళ్తున్న అభ్యర్థులు



పరిగి: లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుంచే జిల్లాలో పొలిటికల్ వార్ మొదలైంది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించాయి. చేవెళ్ల లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా రంజిత్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీఆర్‌ఎస్ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్ బరిలో నిలిచారు. అభ్యర్థులు, నాయకులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. బీజేపీ అభ్యర్థి కొండా తనదైన శైలిలో ప్రచారం చేస్తూ దూకుడు పెంచారు. జిల్లాలో ఇప్పటికే మొదటి విడత ప్రచారాన్ని ముగించారు. ప్రస్తుతం మూడు పార్టీల మధ్య పోటీ తీవ్రంగా ఉంది. ఎవరికి వారు ఎత్తుకు పైఎత్తులు వేస్తూ జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయిలోని ముఖ్య నేతలకు గాలం వేసి పార్టీ కండువా కప్పి పైచేయి సాధించుకునేందుకు అడుగులు వేస్తున్నారు. ఆయా పార్టీల్లోని ముఖ్య నాయకులు అంతర్గతంగా ప్రజల్లో పలుకుబడి ఉన్న వ్యక్తులను కలుస్తూ మద్దతు కూడగడుతున్నారు. మరో వైపు కుల సంఘాల నేతలకు గాలం వేస్తూ ఓట్లు రాబట్టే పనిలో నిమగ్నమయ్యారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీల నాయకులు మండలాల వారీగా కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన గ్యారంటీలను విస్తృతంగా ప్రచారం చేస్తూనే అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేస్తూ ముందుకెళుతున్నారు. బీజేపీ గ్రామ స్థాయిలో ప్రచారం చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న సంచలనాత్మక నిర్ణయాలను, పథకాలు, దేశ పురోగతిని ప్రజలకు వివరిస్తూ ప్రచారం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ బీసీ నినాదం, పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి తదితర అంశాలను ప్రజల్లోకి తీసుకెళుతోంది.

ప్రచారంలో కుటుంబీకులు

కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు ఇప్పటికే ప్రచారంలో దూకుడు పెంచాయి. అభ్యర్థులతో పాటు వారివారి కుటుంబ సభ్యులు కూడా ప్రచారంలోకి దిగారు. 2019 ఎన్నికల్లో పార్టీ నాయకులే ప్రచారం చేయగా, ఈ సారి అభ్యర్థుల తరఫున కుటుంబ సభ్యులు ప్రచారం చేస్తున్నారు. మహిళలు గ్రామాల్లో తిరుగుతూ యువతులు, స్త్రీలను జతకడుతూ అభ్యర్థి గెలుపుకోసం శ్రమిస్తున్నారు. యువకులు తోటి వారితో మమేకమై అందరినీ కలుపుకొని పార్టీ గెలుపునకు కృషి చేస్తున్నారు.

నాయకుల్లో అంతర్మథనం

ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు అంతర్మథనంలో పడ్డారు. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల నుంచి బలమైన నాయకులు ఉన్నప్పటికీ హస్తం, కమలం మధ్యే పోటీ ఉంటుందని ప్రచారం జరుగుతోంది. బీజేపీ అభ్యర్థి రెండు సంవత్సరాలుగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరఫున ప్రచారం చేసి కాంగ్రెస్‌ను ఓడగొట్టాలని చూసిన ఎంపీ రంజిత్‌రెడ్డి ప్రస్తుతం కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలవడంతో జిల్లాలోని మూడు నియోజకవర్గాల హస్తం పార్టీ నాయకులు ఆలోచనలో పడ్డారు.

ప్రతి గింజా కొనుగోలు చేస్తాం

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

- కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి: కలెక్టర్ నారాయణరెడ్డి



పరిగిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

పరిగి: రైతులు దళారులను నమ్మి మోసపోరాదని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే వరి ధాన్యాన్ని విక్రయించాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. మంగళవారం పట్టణంలోని మార్కెట్ యార్డులో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులకు ప్రభుత్వం మంచి మద్దతు ధర ఇస్తోందన్నారు. క్వింటాలు ఏ గ్రేడ్ వరికి రూ. 2,203, బీ గ్రేడ్‌కు రూ. 2,183 ధర చెల్లిస్తున్నట్లు తెలిపారు. రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామన్నారు. కేంద్రాల వద్ద రైతులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలని అధికారులకు సూచించారు. తూకం మిషన్లు, టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు, తేమ శాతం కొలిచే మీటర్లు, మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పట్టణంలోని మినీ గ్రౌండ్‌లో గల ఈవీఎం, వీవీ ప్యాట్స్ భద్రపరిచిన స్ట్రాంగ్ రూంను పరిశీలించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ రాజేశ్వర్, వ్యవసాయశాఖ జిల్లా అధికారి గోపాల్, ఆర్డీఓ వాసుచంద్ర, తహసీల్దార్ ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రావొద్దు

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తుగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని నస్కల్ గ్రామంలో తాగునీటి సరఫరాపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి నీటి సరఫరా చేస్తున్న బావిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని చేతిపంపులు, బోరు బావులకు మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. ప్రజలు నీటిని వృథా చేయరాదన్నారు. ప్రతి నీటి బొట్టునూ ఒడిసి పట్టుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉంటూ నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. నీటి సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రోజురోజుకు ఎండ తీవ్రత పెరుగుతున్నందున ప్రజలు అవసరం ఉంటే తప్ప బయటకు వెళ్లరాదని సూచించారు.

పెండింగ్ దరఖాస్తులు పూర్తిచేయండి

ఓటరు నమోదులో పెండింగ్ దరఖాస్తులన్నింటినీ ఈ నెల 25వ తేదీ నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు చెందిన అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి తప్పులు లేకుండా ఓటరు జాబితాను రూపొందించాలన్నారు. ఈ నెల 18న నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. ఎఫ్‌ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ బృందాలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. చెక్ పోస్టుల వద్ద తనిఖీలను ముమ్మరం చేయాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల తరహాలో లోక్‌సభ ఎన్నికలను కూడా పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం నియోజకవర్గాల వారీగా ఏఆర్‌ఓల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, ఆర్డీఓలు వాసుచంద్ర, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యం

- అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

మర్పల్లి: హామీల అమలులో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, మోదీ మళ్లీ ప్రధాని అయితే పరిశ్రమలన్నీ ప్రైవేటు పరం అవుతాయని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆరోపించారు. మంగళవారం మర్పల్లిలోని ఎంసీఎం ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటేనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. దేశం ఐక్యంగా ఉండాలనే ఉద్దేశంతోనే రాహుల్ గాంధీ పాదయాత్ర చేశారని తెలిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాంటి విజయం సాధించామో అదే ఉత్సాహంతో పని చేయాలని పిలుపునిచ్చారు. చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రధాని మోదీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేని విమర్శించారు. రెండు లక్షల ఉద్యోగాలు నేటి వరకు ఇవ్వలేదన్నారు. కుల రాజకీయాలు చేయడంలో మోదీ దిట్ట అని ఎద్దేవా చేశారు. పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరుకుల ధరలు పెంచి పేదల నడ్డి విరిచారని మండిపడ్డారు.

చేవెళ్ల అభివృద్ధికి కృషి: రంజిత్‌రెడ్డి

తనను మరోసారి ఎంపీగా గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అభ్యర్థి రంజిత్‌రెడ్డి హామీ ఇచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలను సమర్థ వంతంగా అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తమపై లేని పోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డాడు. తనపై చేసిన ఆరోపణలను నిరూపిస్తే దేనికైనా సిద్ధమని సవాల్ విసిరారు. ఇకపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే తనను గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ బ్లాక్ -2 అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు రవీందర్, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి పార్టీ రాష్ట్ర నాయకులు రాములు యాదవ్, సుభాష్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురేష్, వైస్ చైర్మన్ రామేశ్వర్, సహకార సంఘం చైర్మన్ ప్రవీణ్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఫసియొద్దీన్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌ల తనిఖీ

కందుకూరు: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆవరణలో 108, 102 అంబులెన్స్‌లను మంగళవారం 108 అంబులెన్స్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ శ్రీకాంత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంబులెన్స్‌లలో అవసరమైన పరికరాలు, మందులు ఉన్నాయా అని పరిశీలించారు. ఆక్సిజన్ సరఫరా, రికార్డులను తనిఖీ చేశారు. ఫోన్ వచ్చిన వెంటనే స్పందించి, అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు.

క్లుప్తంగా

తాగునీరు, విద్యుత్ సరఫరాలో జాప్యం తగదు

మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి


గ్రామస్తులతో మాట్లాడుతున్న జగదీశ్వర్‌రెడ్డి

కొడంగల్: మున్సిపల్ పరిధిలో తాగునీరు, విద్యుత్ సరఫరాలో జాప్యం తగదని మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మున్సిపల్ పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. తాగునీటిని క్రమం తప్పకుండా సరఫరా చేయాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ సిబ్బందికి సూచించారు. గ్రామంలో చేతి పంపులు, బోరు మోటార్ల పనితీరును పరిశీలించారు. వేసవిలో ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట కో ఆప్షన్ సభ్యుడు మునీర్, కాంగ్రెస్ నాయకులు మురహరి వశిష్ఠ, నయీం తదితరులు పాల్గొన్నారు.

అడిషనల్ కలెక్టర్ బాధ్యతల స్వీకరణ


ఉమాహారతి

అనంతగిరి: వికారాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్‌గా ఉమాహారతి(2022–23 బ్యాచ్ ఐఏఎస్) మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె కలెక్టర్ నారాయణ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేశారు. అందరి సహకారంతో జిల్లా అభివృద్ధికి పాటుపడతానన్నారు. మంగళవారం నిర్వహించిన రెండు రివ్యూ మీటింగ్‌లలో పాల్గొన్నారు. కాగా ఉమాహారతి ఆల్ ఇండియాలో మూడవ ర్యాంక్ సాధించారు.

దేశంలో నియంత పాలన

సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జాతీయ నాయకుడు చలపతి

అనంతగిరి: దేశంలో పదేళ్లుగా నియంత పాలన సాగుతోందని.. ఈ లోక్ సభ ఎన్నికల్లో అధికార బీజేపీకి ఓటుతో బుద్ధి చెప్పాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జాతీయ నాయకుడు చలపతి అన్నారు. మంగళవారం ఆయన వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చలపతి మాట్లాడుతూ.. బీజేపీ పాలనలో కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబించిందని ఆరోపించారు. వ్యవసాయ చట్టాలు చేసి రైతులను ఇబ్బందులు పెట్టారని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు సంఘటితమై తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకులు వెంకట్రాములు, మైపాల్, చంద్రయ్య, బుగ్గప్ప, సత్యనారాయణ, గోపాల్‌రెడ్డి, గీతా మహేందర్, శ్రీనివాస్, రాములు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో అగ్ని ప్రమాదాల నివారణ

ఏడీఎఫ్ఓ రాజు

షాద్‌నగర్: అప్రమత్తంగా ఉంటే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని ఏడీఎఫ్ఓ రాజు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం షాద్‌నగర్ పట్టణంలోని పలు అపార్టుమెంట్‌లు, రద్దీ ప్రాంతాలో అగ్నిమాపక సిబ్బంది కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏడీఎఫ్ఓ రాజు మాట్లాడుతూ.. ఎండాకాలం నేపథ్యంలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. ప్రజలందరూ అప్రమత్తతతో ఉంటేనే ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు. ఏ చిన్న ప్రమాదం సంభవించినా వెంటనే తమకు సమాచారం అందించాలని సూచించారు. తద్వారా తగిన చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. అగ్ని ప్రమాదాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రాణ నష్టంతో పాటు ఆస్తి నష్టం సంభవిస్తుందని హెచ్చరించారు.

ప్రమాదాల 'ఘాటు'


అనంతగిరి రెండో ఘాట్ రోడ్డులో ఏర్పడిన గుంతలు


నంది ఘాట్ మలుపులో..

- గుంతలమయంగా అనంతగిరి గుట్ట రోడ్డు
- మలుపుల్లో పట్టు తప్పుతున్న వాహనాలు
- ప్రాణాలు పోతున్నా పట్టించుకోని అధికారులు

ఘాట్ రోడ్డులో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. మలుపులు అధికంగా ఉన్న రహదారిలో గుంతలు ఏర్పడి నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రజలు ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం సాగిస్తున్నారు.

ధారూరు: జిల్లాలో పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న అనంతగిరి గుట్టల వాహనదారులకు చుక్కలు చూపుతున్నాయి. అసలే మలుపులున్న ఈ రహదారిలో భారీ గుంతలు ఏర్పడి వాహనాలు పట్టుతప్పుతున్నాయి. దీంతో ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. ఎదురెదురుగా వాహనాలు ఢీకొన్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ఏ కాస్త ఏమరుపాటుగా వాహనం నడిపినా పెను ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

పదేళ్లలో వంద మీటర్ల మరమ్మతు

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మొదటి ఘాట్‌లో వికారాబాద్ పరిధి వరకు కేవలం 100 మీటర్ల వరకు కొత్తగా రోడ్డు వేసి మమ అనిపించారు. ధారూరు మండల పరిధిలోని ఆర్ అండ్ బీ రోడ్డు ప్రారంభం నుంచి వదిలివేశారు. ఈ రోడ్డులో తరచూ జిల్లా స్థాయి అధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులు ప్రయాణం సాగిస్తున్నా పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. హైదరాబాద్ నుంచి ప్రయాణిస్తున్న వాహనాలు గుంతల్లోంచి వెళ్లడంతో వాహనాలు లోయలోకి పడిపోయిన ఘటనలు అనేకం ఉన్నాయి. కొందరు ప్రాణాలు కోల్పోగా మరికొందరు క్షతగాత్రులుగా మారడం పరిపాటయింది. ఇటీవల ఆర్టీసీ బస్సులకు జరిగిన ప్రమాదాల్లోనూ ఇద్దరు ప్రయాణికులు విగతజీవులయ్యారు. గుంతలకు మరమ్మతులు చేయించాల్సిన ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాత్రిళ్లు ఈ ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయంటూ పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాండూరు–హైదరాబాద్ మార్గంలోని అనంతగిరి కొండల్లోని ఘాట్ రోడ్డుకు దశాబ్దాల నుంచి మరమ్మతుకు నోచుకోలేదని వివచారం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అనంతగిరిగుట్ట రోడ్డునైనా బాగుచేయించి ప్రమాదాలను అరికట్టాలని వాహనదారులు, పర్యాటకులు కోరుతున్నారు.

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పర్యాటకులు

అనంతగిరిగుట్టలోని 9వ కిలోమీటర్ నుంచి ధారూరు వరకు ఉన్న ధారూరు ఆర్ అండ్ బీ రోడ్డు ప్రమాదకరంగా మారింది. అనంతగిరిగుట్టకు, కోట్‌పల్లి ప్రాజెక్టు వీక్షించేందుకు వచ్చే పర్యాటకులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సైడ్‌బర్మ్‌లు సైతం ప్రయాణాన్ని ప్రమాదకరంగా మారుస్తున్నాయంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


మొదటి ఘాట్ సమీప రోడ్డు దుస్థితి

వివాహిత మృతికి కారణమైన ముగ్గురికి రిమాండ్

యాలాల: ఓ వివాహిత మృతికి కారణమైన భర్త, అత్త, మరో మహిళను యాలాల పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, సీఐ అశోక్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని కమాల్‌పూర్ గ్రామానికి చెందిన గుమ్మడి ప్రియాంక(28) నెల రోజుల క్రితం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కాగా తాను ఆత్మహత్యాయత్నానికి పాల్పడటానికి తన భర్త గుమ్మడి రవి, అత్త గుమ్మడి వెంకటమ్మ, మరో మహిళ అంజమ్మ కారణమంటూ వాంగ్మూలం ఇచ్చింది. అనంతరం పరిస్థితి విషమించడంతో ప్రియాంక మృతి చెందింది. ఈ మేరకు యాలాల ఎస్ఐ శంకర్ కేసు నమోదు చేశారు. మృతికి కారకులైన ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

వ్యక్తిపై పోక్సో కేసు

నిందితుడికి రిమాండ్

యాలాల: మైనర్‌ను వేధిస్తున్న వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసిన యాలాల పోలీసులు నిందితుడిని రిమాండ్ తరలించారు. డీఎస్పీ బాలకృష్ణారెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని రాజీవ్ కాలనీలో ఉండే ఓ మైనర్‌ను అదే కాలనీకి చెందిన ఇంతియాజ్ అనే వ్యక్తి తరుచూ వేధించేవాడు. ఈ క్రమంలో బాధితురాలి తల్లి యాలాల పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టిన పోలీసులు ఇంతియాజ్‌పై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. మైనర్‌లను వేధిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని రూరల్ సీఐ అశోక్ కుమార్, యాలాల ఎస్ఐ శంకర్ హెచ్చరించారు.

అడవి నుంచి ఇసుక తరలింపు

ట్రాక్టర్‌ను సీజ్ చేసిన ఫారెస్ట్ అధికారులు

ధారూరు: అడవిలోంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఫారెస్ట్ అధికారులు సీజ్ చేశారు. ఈ ఘటన ధారూరు ఫారెస్ట్ రేంజ్ రాస్నం సెక్షన్ పరిధిలోని సంగాయిపల్లి తండా సమీప అటవీ ప్రాంతంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మొయినుద్దీన్ తెలిపిన ప్రకారం.. ఇసుక తరలిస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు బీట్ ఆఫీసర్ ఆనంద్, ఫారెస్ట్ బేస్ క్యాంపు సిబ్బంది పెంటయ్య, ఎల్లప్ప బృందంతో సంగాయపల్లి తండాకు చేరుకున్నామన్నారు. తండాకు చెందిన మిట్టునాయక్ ఇసుక తరలిస్తుండగా అదుపులోకి తీసుకుని ధారూరు ఠాణాకు తరలించామన్నారు. తరచూ ఇసుక అక్రమంగా తరలిస్తున్న మిట్టునాయక్‌పై 2019లో అటవీ జంతుల వేటలో, ఈ ఏడాది చెట్లను అక్రమంగా నరికిన కేసులో ప్రధాన నిందితుడని ఇప్పటి వరకు చలాన్లు చెల్లించకుండా తప్పించుకు తిరుగుతున్నాడని ఎఫ్ఎస్ఓ చెప్పారు. కేసు దర్యాప్తులో ఉంది.


ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసిన ఫారెస్టు అధికారులు

ప్రమాదాల నివారణకు చర్యలు

- డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారి లైసెన్స్ రద్దు
- కలెక్టర్ నారాయణరెడ్డి

అనంతగిరి: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో ఎస్పీ కోటిరెడ్డి, అడిషనల్ కలెక్టర్ ఉమాహారతితో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మూడేళ్లుగా జరిగిన రోడ్డు ప్రమాదాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో రోడ్డు ప్రమాదాలకు గల కారణాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్న 16 బ్లాక్ స్పాట్స్‌లలో ఆర్ అండ్ బీ, పోలీస్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి ప్రమాదాలకు కారణాలను తెలుసుకోవాలని సూచించారు. ప్రమాదాలు జరిగినప్పుడు అత్యవసర చికిత్సల నిమిత్తం అంబులెన్స్ సౌకర్యం, పరిసర ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాన్నారు. డ్రంకెన్ డ్రైవ్‌పై నిఘా పెంచి కేసులైన వారి లైసెన్స్ తప్పక రద్దు చేసేందుకు నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. బెల్ట్ షాపులు తొలగించాలని ఆదేశించారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలి

పోలీస్, రవాణా శాఖ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వివిధ వాహనాలతో పాటు పాఠశాలల్లో అద్దెకు తీసుకుని నడుపుతున్న బస్సుల ఫిట్‌నెస్, డ్రైవర్ల లైసెన్సులను తనిఖీ చేయాలని కలెక్టర్ సూచించారు. పట్టణ, మున్సిపల్ కేంద్రాల్లో పార్కింగ్ స్థలాలు గుర్తించి ప్రతిపాదనలు సమర్పిస్తే మంజూరు చేస్తామన్నారు. మున్సిపల్ కూడళ్లలో సీసీ కెమెరాలు, సూచిక బోర్డుల ఏర్పాటుకు కావాల్సిన నిధులకు ప్రతిపాదనలు సమర్పించాలని కోరారు. రహదారులపై బ్రిడ్జిలను గుర్తించేలా రేడియంతో కూడిన సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, బ్లింకర్స్ ఎప్పటికప్పుడు సరి చూసుకుంటే ప్రమాదాలు నివారణకు అవకాశం ఉంటుందన్నారు. రోడ్ల పై రైతులు పంటలను నూర్పిళ్లు (కల్లాలు) చేయకుండా అవగాహన కల్పించి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఈఈ లాల్‌సింగ్, పంచాయతీరాజ్ ఈఈ ఉమేశ్, డీఎంహెచ్ఓ పల్విన్ కుమార్, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకట్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, పోలీస్ అధికారులు, ఇంజనీర్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

ఐసీడీఎస్ సీడీపీఓ రోజా

కద్తాల్: మానవ అక్రమ రవాణాను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఐసీడీఎస్ సీడీపీఓ రోజా, ప్రజ్వల సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ బలరాం కృష్ణ పేర్కొన్నారు. మానవ అక్రమ రవాణాను నిరోధించడానికి, మహిళా శిశు సంక్షేమశాఖ, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో రెండు రోజులుగా అంగన్‌వాడీ సిబ్బందికి నిర్వహించిన శిక్షణా కార్యక్రమం మంగళవారం ముగిసింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీఓ రోజా మాట్లాడుతూ.. నేటి సమాజంలో మానవ అక్రమ రవాణా కొత్త పద్ధతుల ద్వారా సైబర్ ట్రాఫికింగ్‌తో జరుగుతుందన్నారు. మొబైల్‌లో ఆన్‌లైన్ వాడుతున్న ఎవరైనా దీనికి గురయ్యే అవకాశం ఉందన్నారు. సమాజంలో ప్రధానంగా యువతతో పాటు, ప్రముఖులు కూడా ఇంటర్‌నెట్, మొబైల్ ద్వారా సైబర్ ట్రాఫికింగ్ బారిన పడుతున్నారన్నారు. యువతులు సెల్‌ఫోన్‌లో వచ్చే రకరకాల యాప్స్‌తో లైంగిక వ్యాపారానికి గురికావడం జరుగుతుందని, ఫొటోస్ మార్ఫింగ్ చేసి బ్లాక్ మెయిల్ చేస్తున్నారని తెలిపారు. మానవ అక్రమ రవాణాను అరికట్టడంలో అంగన్వాడీలు ప్రత్యేక కృషి చేయాలన్నారు. మహిళలు, పిల్లలకు రక్షణ కవచంలా మారాలని సూచించారు. అనంతరం ప్రజ్వల సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ బలరాం కృష్ణ మాట్లాడుతూ.. ప్రజ్వల సంస్థ గత 28 ఏళ్లుగా లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా పోరాడుతుందని, ఇప్పటి వరకు 28,500 మంది మహిళలను కాపాడామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పద్మశ్రీ డాక్టర్ సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు శబరి, సరళ, ప్రజ్వల సిబ్బంది సురేశ్, అనిల్, అంబర్‌సింగ్, మిథాలీరాజ్, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాలు

ముస్తాబవుతున్న ఆలయం

ఈ నెల 25వ తేదీ వరకు ఉత్సవాలు

మొయినాబాద్: వీసా దేవుడు.. కలియుగదైవం చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాలకు సిద్ధమయ్యారు. భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతూ.. తెలంగాణ తిరుపతిగా పేరొందిన ఆలయం వేడుకలకు ముస్తాబైంది. ఐదు శతాబ్దాల చరిత్ర కలిగిన దేవాలయంలో ఏటా శ్రీరామనవమి తరువాత దశమి రోజు నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈసారి కూడా ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 18 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమై 25 వరకు కొనసాగనున్నాయి.

ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

బాలాజీ బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 19న ధజారోహ ణం అనంతరం సంతానం లేని మహిళలకు గరుడ ప్రసాదం అందిస్తాం. ప్రసాదంకోసం వచ్చే మహిళలు ఉదయం 8 గంటల లోపే ఆలయానికి చేరుకోవాలి.

– రంగరాజన్, ఆలయ అర్చకుడు

ఇంటి తాళాలు పగలగొట్టి చోరీ

రెండు తులాల వెండి వస్తువుల అపహరణ

షాబాద్: గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడిన సంఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. సీఐ కాంతారెడ్డి, ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సంకెపల్లిగూడ గ్రామానికి చెందిన ముద్దెంగూడ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య ఇంటి తాళాలు పగలగొట్టి దుండగులు లోపలికి చొరబడ్డారు. అర్ధరాత్రి బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు తలపై టోపీలు ధరించి చేతిలో ఖట్టర్ పట్టుకొని మొదటగా సీసీ కెమెరా వైర్లను తొలగించారు. సీసీ ఫుటేజ్ పరిశీలించగా ఈ దొంగతనానికి ఇద్దరు వచ్చినట్లు గుర్తించారు. కింద అంతస్తుకు తాళం వేసి పైన అంతస్తులో కుటుంబ సభ్యులు నిద్రిస్తున్నారు. దుండగులు యజమానులు నిద్రిస్తున్న తలుపునకు బయటి నుంచి గడియ పెట్టారు. లోపలికి వెళ్లి బీరువా తాళం సైతం పగుల గొట్టి అందులో ఉన్న వస్తువులను చిందరవందరగా చేశారు. అందులో ఉన్న రెండు తులాల వెండి వస్తువులను అపహరించారు. మంగళవారం ఉదయం ఇంట్లో పనిచేస్తున్న వ్యక్తి వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి క్లూస్‌టీం బృందం చేరుకొని ఆధారాల సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసుల తెలిపారు.


ఆధారాలు సేకరిస్తున్న ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి

కూలీలందరికీ పని కల్పించండి

కొందుర్గు: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలందరికీ పని కల్పించాలని డీఆర్‌డీఓ శ్రీలత సూచించారు. మండలంలోని పర్వతాపూర్, గంగన్నగూడ గ్రామాల్లో మంగళవారం ఆమె పర్యటించి ఉపాధి పనులతోపాటు నర్సరీలను పరిశీలించారు. అనంతరం ఉపాధి కూలీలతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. వేసవి తీవ్రత అధికంగా ఉన్నందున కూలీలు ఉదయం వేళల్లోనే పనులకు వెళ్లాలని సూచించారు. గతంలో రోజుకు రూ.272 చెల్లించేవారని, ప్రస్తుతం ప్రభుత్వం రూ.300కు కూలీ పెంచిందన్నారు. కొలతల ప్రకారం పనులు చేయాలని సూచించారు. నర్సరీల్లో మొక్కలు ఏపుగా పెరిగేలా చూడాలని, మొక్కలను సకాలంలో మల్చింగ్ చేయాలని సూచించారు. అనంతరం కొందుర్గు మండలపరిషత్ కార్యాలయంలో గ్రామ ప్రత్యేకారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధిహామీ కూలీలు సేద తీరడానికి పని ప్రదేశంలో టెంట్ ఏర్పాటు చేయాలన్నారు. తాగునీరు, ప్రథమ చికిత్స కిట్టు అందుబాటులో ఉంచాలన్నారు. మస్టర్‌లో పేర్లు నమోదుచేసిన కూలీలే పనులు చేయాలని సూచించారు.

డీమ్డ్ వర్సిటీలో డాక్టరేట్ల ప్రదానం


యూనివర్సిటీలో డాక్టరేట్ పొందిన కరుణశ్రీ

మొయినాబాద్‌రూరల్: కష్టపడి ఆవిష్కరించిన నూతన పరిశోధనలు సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని చైతన్య డీమ్డ్ టుబీ యూనివర్సిటీ కులపతి డాక్టర్ పురుషోత్తమ్‌రెడ్డి, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి డాక్టర్ సాత్వికరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని హిమాయత్‌నగర్‌లో ఆ యూనివర్సిటీలో మంగళవారం కరుణశ్రీ, రేవతిలకు డాక్టరేట్‌లు ప్రదానం చేశారు. కరుణశ్రీ ఆంగ్లంలో ×ఎన్‌హాన్సింగ్ ఎంప్లాయబిలిటీ స్కిల్స్ ఎమంగ్ ప్రొఫెషనల్ స్టూడెంట్స్ త్రూ ఈ లర్నింగ్ॽ అనే అంశంపై ప్రొఫెసర్ జి.దామోదర్ పర్యవేక్షణలో ఆమె పరిశోధన చేశారు. అదే విధంగా సూక్ష్మ జీవశాస్త్రంలో ×స్టడీస్ ఎట్ ఐసోలేషన్ అండ్ స్క్రీనింగ్ ఆఫ్ యాంటీ బయోఫిల్మ్ మెటాబోలైటిస్ ప్రొమ్సన్ సెలక్టడ్ మెడిసినల్ ప్లాంట్స్ మహబూబ్‌నగర్ జిల్లా తెలంగాణ రాష్ట్రॽ అనే అంశంపై ప్రొఫెసర్ అనురాధ పర్యవేక్షణలో రేవతి పరిశోధన చేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ కులపతి డాక్టర్ పురుషోత్తమ్‌రెడ్డి, చీఫ్ అడ్మినిస్ట్రేటర్ అధికారి డాక్టర్ సాత్వికరెడ్డిలు వీరిని అభినందిస్తు డాక్టరేట్ పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య రవీందర్, ప్రొఫెసర్ కవిత, రిసర్చ్ డీన్ ఆచార్య కిస్టఫర్, డీన్ సైన్స్ ప్రొఫెసర్ సుందర్‌రామ్, అడ్మినిస్ట్రేషన్ రాజు, డిప్యూటీ కంట్రోలర్స్ పబ్లిక్ రిలేషన్ అధికారి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

దారి తప్పిన ధరణి స్పెషల్ డ్రైవ్

- పెండింగ్‌లో భూ సమస్యలు
- యాచారంలో 2,550 భూ పంచాయితీలు
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతులు

యాచారం: పెండింగ్ భూ సమస్యల తక్షణ పరిష్కారం కోసం ప్రభుత్వం చేపట్టిన ధరణి స్పెషల్ డ్రైవ్ దారి తప్పింది. ఇందులో ఏళ్లుగా మోక్షానికి నోచుకోని భూ సమస్యలు ఇక సత్వరమే పరిష్కారమవుతాయని ఎంతో ఆశపడిన అన్నదాతల ఆశలు నీరుగారిపోయాయి. దీంతో తమ భూ సమస్యలు పరిష్కరించాలని రైతులు నిత్యం కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరగడం పరిపాటిగా మారింది. కాంగ్రెస్ సర్కార్ ఏర్పాటైన వెంటనే మార్చి 1 నుంచి 9వ తేదీ వరకు పెండింగ్ భూ సమస్యల తక్షణ పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ధరణి స్పెషల్ డ్రైవ్ పెట్టింది. యాచారం మండలంలోని 24 గ్రామాల్లో వివిధ రకాల భూ సమస్యలు 2,550 ఉన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. కానీ వాటిని పరిష్కరించేందుకుగాను తహసీల్దార్‌కు లాగిన్ ఇవ్వకపోవడం రైతులకు పెద్ద శాపంగా మారింది.


కొన్నింటికే లాగిన్లు

మండలంలోని మొత్తం భూ సమస్యలు 2,550 కాగా ఖాతా మర్జింగ్–9, జీఎల్ఎం–84, జీపీఏ–4 మ్యాడుళ్లలో కేవలం 97 భూ సమస్యలే ఉన్నాయి. వీటికి మాత్రమే లాగిన్లు చేయడానికి తహసీల్దార్‌కు అనుమతులు ఉన్నాయి. మార్చి 1 నుంచి నేటి వర కు తహసీల్దార్ లాగిన్ నుంచి ఆర్డీఓ, జిల్లా కలెక్టర్‌కు కేవలం 97 రకాల భూ సమస్యలే వెళ్లా యి. అవి కూడా పరిష్కారమయ్యాయా.. లేదా అనే విషయమై స్పష్టత లేకుండా పోయింది. వీటి లో అత్యధికంగా 1,557 టీఎం–33 భూ సమస్యలే ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటి పరిష్కారం పట్ల రైతులు రెవెన్యూ అధికారులను కలిస్తే ఎన్నికల కోడ్ ఉన్నందు వల్ల సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతుందని దాటవేస్తున్నారు.

సమావేశాలు నిర్వహించినా..

భూ సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించడం కోసం లీఫ్స్ సంస్థ(లీగల్ ఎంపవర్మెంట్ అండ్ అసిస్టెన్స్ ఫర్ ఫార్మార్స్ సొసైటీ) అధ్యక్షుడు డాక్టర్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో యాచారం మండలాన్ని పైలెట్ కింద తీసుకున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో లీఫ్స్ సంస్థ ప్రతినిధుల బృందం భూ న్యాయ శిబిరాలు నిర్వహించి 2,075 భూ సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. వాటిని పరిష్కరించే విధంగా కృషి చేయాలని లీఫ్స్ సంస్థ ప్రతినిధుల బృందం నివేదికను తహసీల్దార్ అయ్యప్పకు అందజేసింది. ప్రభుత్వం నియమించిన ధరణి కమిటీ సభ్యులైన ముదిరెడ్డి కోదండరెడ్డి, సునీల్‌కుమార్, లచ్చిరెడ్డిలు పలుమార్లు మండలాన్ని సందర్శించి రైతులతో మాట్లాడి, రెవెన్యూ అధికారులతో కూడా సమావేశమైనారు. కానీ పరష్కారం మాత్రం నేటికీ కాలేదు.


నిషేధిత జాబితాలో పెట్టారు



నక్కర్తమేడిపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వేనంబరు 272లో నా పేరు మీద 8 ఎకరాల వ్యవసాయ పట్టా భూమి ఉంది. ఈ భూమిని రెవెన్యూ అధికారులు నిషేధిత జాబితాలో పెట్టారు. పలుమార్లు తహసీల్దార్, ఆర్డీఓ, జిల్లా కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరిగినా పరిష్కారం కాలేదు.

– బొగ్గుల పాపిరెడ్డి, రైతు, నక్కర్తమేడిపల్లి

త్వరలోనే పరిష్కరిస్తాం



మండలంలోని 24 గ్రామాల్లో 2,550 రకాల భూ సమస్యలు ఉన్నట్లు గుర్తించాం. కానీ మూడు రకాల భూ సమస్యల పరిష్కారానికి లాగిన్లు వచ్చాయి. మొత్తం 97 భూ సమస్యల పరిష్కారం కోసం లాగిన్ చేశాం. అన్ని రకాల సమస్యలపై రికార్డులను పరిశీలిస్తున్నాం. త్వరలోనే పరిష్కరించే విధంగా కృషి చేస్తాం.

– అయ్యప్ప, తహసీల్దార్ యాచారం

బీజేవైఎం నూతన కార్యవర్గం నియామకం

రంగారెడ్డి రూరల్ జిల్లా అధ్యక్షుడిగా యాదీశ్

మహేశ్వరం: బీజేవైఎం రంగారెడ్డి జిల్లా రూరల్ నూతన కార్యవర్గాన్ని జిల్లా పార్టీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి మంగళవారం ప్రకటించారు. జిల్లా బీజేవైఎం అధ్యక్షుడిగా టి.యాదీష్(మహేశ్వరం), ఉపాధ్యక్షులు బొధ యాదగిరిరెడ్డి(తుక్కుగూడ), బాతుక శ్రీనివాస్ యాదవ్(శంషాబాద్), కండె సాయి(ఆమన్‌గల్),సూరంపల్లి రూపక్(ఇబ్రాహీంపట్నం) ర్యాకాల రాఘవేందర్(మీర్‌పేట్) బస్వ రాఘవేందర్(మహేశ్వరం), గోవర్ధన్‌రెడ్డి(శంషాబాద్) అమర్‌నాథ్‌రెడ్డి(మీర్‌పేట్), జనరల్ సెక్రటరీలుగా బూర దిలీప్ గౌడ్(కందుకూరు), రాజ మల్లేశ్(మెయినాబాద్), సెక్రటరీలుగా విజయ్(ఇబ్రహీంపటనం), మునావత్ దేవేందర్(మహేశ్వరం), ఓగ్గు ప్రభాకర్(ఆమన్‌గల్), శివ గౌడ్(మంచాల), మారగోని శేఖర్(యాచారం), విశ్వనాథ్‌గౌడ్(బడంగ్‌పేట్), సందీప్ యాదవ్(షాద్‌నగర్), ఇంద్రాసేనారెడ్డి(చేవెళ్ల), నరేందర్ గౌడ్(యాచారం), అధికార ప్రతినిధులుగా కొత్తురు మహేందర్(షాబాద్), కారుకొండ ప్రదీప్(శంషాబాద్), జోల రమేష్ యాదవ్(మాడ్గుల), ప్రకాష్ గౌడ్(మహేశ్వరం), అగ్గి ప్రవీణ్(నందిగామ), దాసరి సందీప్ గౌడ్(మంచాల), శివాజీ(కేశంపేట్), కోశాధికారులుగా మహేష్ చారి(ఆదిబట్ల), సాయిలు(మహేశ్వరం) నియమించారు.